ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 28-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

ముఖ్యాంశాలు

- భారతదేశ ప్రాచీన నాగరికత ఎల్లప్పుడూ వసుధైవ కుటుంబం అనే సందేశాన్నిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు.
- కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు భగవద్గీత ప్రేరణ ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- దేశ సార్వభౌమత్వం, ప్రజల భద్రత విషయంలో రాజీపడేది లేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఉద్ఘాటించారు.
- ఆత్మనిర్భర్ భారత్.. ఒక సమిష్టి జాతీయ లక్ష్యంగా మారిందని కేంద్ర మంత్రి పియూష్ గోయల్ వ్యాఖ్యానించారు.

= = = = = = = = = = = = = = = = = = =

సమాజాన్ని శాంతియుతంగా, ఆరోగ్యంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం పలు కీలక చర్యలు తీసుకుంటోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. లక్నోలో ఈరోజు జరిగిన బ్రహ్మకుమారీల వార్షిక కార్యక్రమం ప్రపంచ ఐక్యత, విశ్వాసం కోసం ధ్యానం ప్రారంభోత్సవంలో రాష్ట్రపతి ప్రసంగించారు. ప్రపంచ వ్యాప్తంగా యోగా, ధ్యానాన్ని ప్రోత్సహించడం కోసం భారత్ అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రచారానికి నాయకత్వం వహించిందని అన్నారు. భారత ప్రాచీన నాగరికత ఎల్లప్పుడూ ప్రపంచానికి వసుధైవ కుటుంబం అనే సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. సమాజంలో విలువలను పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వివరిస్తూ...

(వాయిస్...31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ, చిరుధాన్యాలను ఉపయోగించి ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. కర్నాటకలోని ఉడుపి శ్రీ కృష్ణ మఠం భక్తులను ఉద్దేశించి ఈరోజు ఆయన మాట్లాడారు. నదుల సంరక్షణ, ఏక్ పేడ్ మా కే నామ్‌లో భాగం కావడం, పేదరికం నుండి కనీసం ఒక వ్యక్తిని ఉద్ధరించడడం, స్వదేశీ ఉద్యమాన్ని ప్రోత్సహించడం మొదలైన వాటికి మద్దతు ఇవ్వాలని సాధువులకు, భక్తులకు ఆయన విజ్ఞప్తి చేశారు. పురాతన లిఖిత ప్రతుల పరిరక్షణతో సహా తొమ్మిది తీర్మానాలను ప్రస్తావించిన ఆయన.. వీటికి పౌరుల నిబద్ధత ఉండాలని ఆకాంక్షించారు. కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు శ్రీమద్భగవద్గీత ప్రేరణనిస్తుందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్...32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

ఇండో-పసిఫిక్, గ్లోబల్ సౌత్ లోని దేశాలు భారత్‌ను ఒక విశ్వసనీయమైన భాగస్వామిగా పరిగణిస్తున్నాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన చాణక్య డిఫెన్స్ డైలాగ్ (CDD) 2025ను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. మారుతున్న ప్రపంచ పరిస్థితులతో పాటు భారత్ కూడా పరివర్తన చెందుతోందన్నారు. భారత్ ఎల్లప్పుడూ శాంతి చర్చలను విశ్వసిస్తూ ఆ విధానానికి కట్టుబడి ఉందని, అయితే దేశ సార్వభౌమత్వం, దేశ ప్రజల భద్రత విషయానికి వస్తే, రాజీ పడబోదని స్పష్టం చేశారు. సురక్షిత భారత్ లేకుండా వికసిత్ భారత్ సాధ్యం కాదని, అలాగే సశక్త భారత్ లేకుండా సురక్షిత భారత్ కూడా సాధ్యం కాదని రక్షణ మంత్రి వివరించారు. దేశ సాయుధ దళాలు తమ సమర్థతను పలు సందర్భాల్లో ప్రదర్శించాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యసాధనకు దేశ పౌరులంతా తమదైన రీతిలో దోహదపడుతున్నారని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖా మంత్రి పియూష్ గోయల్ అన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఇండస్ట్రీ చాంబర్ FICCI 98వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆత్మనిర్భర్ భారత్ ఇప్పుడు ఒక సమిష్టి జాతీయ లక్ష్యంలా మారిందన్నారు. పలు దేశాలతో చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు దేశంలో వ్యాపార, పెట్టుబడుల పరిధిని పెంచాయన్నారు. ఈ అంశంపై భారత్.. అమెరికా, యూరోపియన్ యూనియన్‌తో సహా 14 గ్రూప్ దేశాలతో చర్చలు జరుపుతోందని చెప్పారు. భారత్‌లో 100 బిలియన్ డాలర్ల పెట్టుడులు పెట్టేందుకు అనేక ప్రపంచ స్థాయి సంస్థలు సిద్ధంగా ఉన్నాయని పియూష్ గోయల్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = =

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

వికసిత్ భారత్ లక్ష్యం ప్రజల ఐకమత్యం ద్వారానే సాధ్యమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. గోవాలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పర్తగలి జీవోత్తమ మఠం సార్థ పంచ శత మానోత్సవంలో ఆయన ఈరోజు పాల్గొని భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. చారిత్రాత్మకమైన ఈ మఠం భవిష్యత్ తరాలకు స్ఫూర్తినిచ్చే పునాదిరాయి వంటిదన్నారు. ఈ సందర్భంగా పార్తగలిలో 77 అడుగుల శ్రీరాముని కాంస్య విగ్రహాన్ని  ప్రధానమంత్రి ఆవిష్కరించారు. కొత్త రామాయణ థీమ్ పార్క్ గార్డెన్ ను, 10 వేల చదరపు అడుగుల మ్యూజియంను ఆయన ప్రారంభించారు. అలాగే ప్రత్యేక పోస్టల్ స్టాంపును, స్మారక నాణాన్ని కూడా విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = = =

భారత్.. త్వరలో ప్రపంచంలోనే ప్రధాన సెమీకండక్టర్ దేశంగా మారుతుందని కేంద్ర సమాచార, ప్రసార, ఎలక్ట్రానిక్స్ శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. మొహాలీలోని సెమీ కండక్టర్ ల్యాబ్ (SCL) లో  సెమీకండక్టర్ ప్రాసెస్ గ్యాలరీని, శిక్షణా ప్రయోగశాలను ఆయన ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..  పంజాబ్‌కు చెందిన SCL ను 4 వేల 500 కోట్ల పెట్టుబడితో అభివృద్ధి చేస్తామని, ఉత్పత్తిని 100 రెట్లు పెంచేలా కొత్త సాధనాలు, పరికరాలతో ఆధునీకరిస్తామని చెప్పారు. దేశ సెమీ కండక్టర్ రంగంలో SCL కీలక పాత్ర పోషిస్తుందని కేంద్రమంత్రి పేర్కొంటూ...

(వాయిస్…28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

గోవాలో జరుగుతున్న 56వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం IFFI మరికొద్ది సేపట్లో ముగియనుంది. ముగింపు వేడుక  శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ఘనంగా జరుగుతోంది. ఈ ఉత్సవానికి గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి డాక్టర్ ఎల్ మురుగన్ హాజరయ్యారు. అలాగే ప్రముఖ నటులు రజనీకాంత్, రిషభ్ శెట్టి, రణ్వీర్‌సింగ్ సహా పలువురు సినీ ప్రముఖులు హాజరవుతున్నారు. ఈ సంవత్సరం IFFIలో 81 దేశాల నుండి 240 కి పైగా సినిమాలు ప్రదర్శించబడ్డాయి. వాటితో పాటు మాస్టర్ క్లాస్‌లు, WAVES ఫిల్మ్ బజార్ మొదలైనవి సినీ ప్రియులను అలరించాయి.

= = = = = = = = = = = = = = = = = = =

దిత్వా తుఫాను గంటకు 7 నుండి 10 కిలోమీటర్ల వేగంతో తమిళనాడు తీరం వైపుగా కదులుతోందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం ఇది కారైకల్‌కు ఆగ్నేయంగా 320 కిలోమీటర్లు, చెన్నైకి దక్షిణంగా 530 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఉత్తర - వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 30వ తేదీ ఉదయానికి ఉత్తర

తమిళనాడు, దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీరాలకు చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. దీని ప్రభావంతో ఆయా ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 85 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని హెచ్చరికలు జారీచేయబడ్డాయి.

= = = = = = = = = = = = = = = = = = = =

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ వచ్చే నెల 4వ తేదీ నుండి రెండు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆహ్వానం మేరకు భారత్‌లో పర్యటించనున్న ఆయన.. 23వ భారత్-రష్యా వార్షిక శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు. ఈ పర్యటనలో భాగంగా పుతిన్.. ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చలు జరుపుతారని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = =